21. 06. 2020



**3-89**

## మున్నుడి

ఈశ్వర తత్త్వం పూర్తిగా ఆకళింపు చేసికొనిన అన్నమాచార్యుల వారు ఆ పరమాత్మను యెవ్వరు. యే పేరుతో పిలిచినా యెలా భావించినా భక్తి, శరణాగతి అనే రెండు చేతులతో పట్టుకుంటే ఘోరమైన సంసార ఝరినుంచి రక్షింప బడవచ్చును అంటున్నారు. వారు సామెతలను రాగబద్ధమైన కీర్తనలలో చెప్పటం చూస్తే ఆయన పాండిత్యానికి ముగ్ధులవుతాం "అంతరాంతరము లెంచి చూడ 'పిండంతే నిప్పటి' యున్నట్లు" - అంటే లోలోపలి బేధములు పరిగణించితే, నిప్పటి (నిప్పుమీద కాల్చిన రొట్టె) ఎంతవుంటుంది అంటే 'పిండంతే' (పిండి ఎంతవుందో అంత).

ఉ॥ ఈతని యెంతమాత్రమున యెవ్వరు యెంచిన అంతమాత్రమే
ఈతడు సర్వరక్షకుడు ఈశ్వరుడింతటి సృష్టికంతకున్
ఈతడె బ్రహ్మయున్ హరుడు ఈతడె శక్తియు అంతకుండుతా
నీతడె వేంకటేశ్వరుడు ఇంపుగ జెప్పెను అన్నమార్యుడున్

రాగం : ద్విరాగమాలిక

ఎంతమాత్రమున నెవ్వరు దలచిన-అంతమాత్రమే నీవు
అంతరాంతరములెంచి చూడ బిం-డంతే నిప్పటి యన్నట్లు ॥ఎంత॥

కొలుతురు మిము వైష్ణవుల-కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు-పరబ్రహ్మంబనుచు
తలతురు మిముశైవులు-తగిన భక్తును శివుడనుచు
అలరిపొగడుదురు కాపాలికులు-ఆదిభైరవుడనుచు ॥ఎంత॥

సరి నెన్నుదురు శాక్తేయులు-శక్తిరూపు నీవనుచు
దరిశనములు(ల) మిము నానావిధులను తలపుల కొలదులు భజింతురు
సిరుల మిమునే యల్పబుద్ధిదల-చినవారికి నల్పంబవుదువు
గరిమల మిమునే ఘనమని తలచిన-ఘనబుద్ధులకు ఘనుడవు ఎంత॥



Scanned with CamScanner

నీవలన కొరతే లేదు మరి-నీరు కొలది తామరవు
ఆవల భాగీరథి దరి బావుల-ఆ జలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము-జేకొని వున్న దైవమని
యీవలనే నీ శరణనియెదను-యిదియే పరతత్త్వము నాకు ॥ఎంత॥

**భావామృతం :**

ఓ ప్రభూ! నిన్ను ఎవ్వరు ఎంతమాత్రముగా భావించిన అంతమాత్రమే, అదే విధముగా నీవుంటావు. లోలోపలి భేదము నెంచి చూచినచో నిప్పటి (నిప్పుల మీద కాల్చిన రొట్టె) యెంతవుంటుందంటే పిండంతే (పిండి యెంతవుందో అంతే) అనే చెప్పుకోవలసి వుంటుంది).

దేవా! మిమ్ముల్వైష్ణవులు విష్ణుమూర్తి అని ప్రేమగా కీర్తిస్తున్నారు. వేదాంతులందరూ మిమ్మల్ని పరబ్రహ్మ అని అంటున్నారు. ఇంకొకవైపున శైవులందరూ మిమ్మల్నే శివుడు అని భక్తులై కొలుచుచున్నారు. కాపాలికులు మిమ్మల్నే ఆదిభైరవుడనే పేరుతో పూజిస్తున్నారు.

స్వామీ! శాక్తేయు నిన్ను సరియైన విధముగా శక్తిరూపముతో వున్నవాడవని ఎన్నిక చేసి యున్నారు. మిమ్ముల్ని అందరూ వారివారి భావాలకు తగ్గట్లుగా (వారి వారి మతానుసారముగా) దర్శించుచున్నారు. సిరి పతివైన నిన్ను అల్పబుద్ధులెవరైనా అల్పముగా భావిస్తే వారికి అల్పముగానే తోచెదవు. మహిమాన్వితుడవైన నిన్ను ఘనుడవని భావిస్తే వారికి ఘనునిగానే కనుపించెదవు.

ప్రభూ! నీవలన ఏవిధమైన కొరతాలేదు. నీవు నీరుకొలది తామరవు (భక్తి కొలది ఫలమొసగు పరమాత్మవు) పవిత్రమైన గంగానది ఒడ్డున మరియు పరిసర ప్రాంతాలలో కల బావులలో ఆ గంగానది జలమే వూరుతుంది కదా! ఓ శ్రీవేంటేశ్వరా! మమ్మల్నందరినీ చేపట్టి రక్షించు దైవము నీవేనని గుర్తించి నిన్నే శరణని నీ దాసుడనైతిని. ఇదియే మాకు గొప్ప పరతత్త్వమై విలసిల్లుచున్నది.



Scanned with CamScanner